# వాస్తవ నేస్తం
తెలుగు దిన పత్రిక
ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...


News Portal Designing
Epaper Designing &
Web Hosting
Vn Media
+91 8099779988
vntelugudaily@gmail.com


సంపుటి : 3 | సంచిక : 307 | మంగళవారం 24 మార్చి 2026 | పేజీలు : 8 | వెల : 5/-
Published form Adilabad, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda, Medchal Malkajgiri


## అది భస్మాసుర హస్తంగా మారింది



- 'కాంగ్రెస్ మేనిఫెస్టోలో ప్రతి ఎకరాకు రూ.15 వేలు ఇస్తామని హామీ ఇచ్చారు
- ఇప్పుడు రూ.12 వేలు ఇస్తామని బడ్జెట్‌లో చెబుతున్నారు
- ఈ ప్రభుత్వం రూ.19 వేల కోట్ల రైతు బంధు ఎగ్గొట్టింది.
- మాజీ మంత్రి హరీష్‌రావు

హైదరాబాద్

తెలంగాణ ప్రభుత్వం మాయమాటలతో రైతులను మభ్యపెడుతోందని మాజీ మంత్రి హరీష్‌రావు అన్నారు. రైతుల పాలిట అభయ హస్తం భస్మాసుర హస్తంగా మారిందని విమర్శించారు. ఇచ్చిన మాట ప్రకారం రైతు భరోసాను రూ.15 వేలకు ఎప్పుడు పెంచుతారో చెప్పాలని నిలదీశారు. ఇవాళ తెలంగాణ అసెంబ్లీలో హరీష్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ సర్కారు తీరుపై విమర్శలు గుప్పించారు. - మిగతా3లో



## డీఎంకేదే అధికారం

- తమిళనాడులో డీఎంకే కూటమికి 180 సీట్లు
- అన్నాడీఎంకే అలయెన్స్ 54 స్థానాలకే పరిమితం: లేటెస్ట్ సర్వే
- త్వరలో తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు
- ముమ్మరంగా డీఎంకే, అన్నాడీఎంకే కూటములు, టీవీకే ప్రచారం
- ఈ క్రమంలో విపక్ష అన్నాడీఎంకే కూటమికి షాక్ ఇచ్చిన 'అగ్ని న్యూస్ సర్వీస్' సర్వే

## మూసీ అభివృద్ధిని ఆపేస్తాం అనకండి

- కావాలంటే ఆ ముగ్గురితో ప్రత్యేక కమిటీ : సీఎం
- ప్రత్యేక ప్రణాళిక ప్రకారం ముందుకెళ్తున్నాం
- మానవ తప్పిదాల వల్లే అనేక సమస్యలు వస్తున్నాయి
- దూరం తగ్గించేందుకు మూసీపై ఎలివేటెడ్ కారిడార్లు వేస్తాం
- శాసనమండలిలో సీఎం రేవంత్ రెడ్డి ప్రకటన



హైదరాబాద్

మూసీ నది అభివృద్ధిలో భాగంగా ఎవరినీ నిరాశ్రయులను చేయమని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. మూసీ పరిధిలో ఉన్న బాధితులందరికీ పునరావాసం కల్పిస్తామన్నారు. మెరుగైన జీవన విధానానికి కావాల్సిన ప్రమాణాలు, విద్య, వైద్య సదుపాయాలు కల్పించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. మూసీ పరివాహకంలో ఉన్న అందరికీ తగిన న్యాయం చేస్తామని శాసనమండలిలో ప్రకటించారు. రెచ్చగొట్టే వారి ఉచ్చులో పడవద్దని మూసీ ప్రాంత ప్రజలను కోరుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. హైదరాబాద్ చారిత్రక నగరం, అనేక సరస్సులు, చెరువులు, గొప్ప కట్టడాలు ఉన్నాయని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. మానవ తప్పిదాల వల్లే ఇవాళ అనేక సమస్యలు వస్తున్నాయని చెప్పారు. ఆదాయ మార్గాలు పెరిగి - మిగతా3లో



## ప్రపంచంలో ఎక్కడ సమస్య వచ్చినా భారత్‌పై ప్రభావం

- భారత్‌కు కూడా సవాళ్లు ఎదురవుతున్నాయి
- యుద్ధం వల్ల ఇతర దేశాలతో జరిగే వాణిజ్యం దెబ్బతింటోంది
- లోక్‌సభలో ప్రసంగించిన ప్రధాని మోదీ
- దేశీయ ఉత్పత్తిని కూడా పెంచుతున్నామని స్పష్టం



## 'ఈ ఏడాది అమెరికాలో జరగబోయే జీ20 సమ్మిట్ వల్ల నో యూజ్'

- పశ్చిమాసియా సంక్షోభాన్ని పరిష్కరించేందుకు 'విశ్వగురు' మోదీ ఎందుకు ప్రయత్నించట్లేదు?
- మిడిల్ ఈస్ట్‌లో అంతకంతకూ ముదురుతున్న యుద్ధం
- అక్కడి సంక్షోభాన్ని పరిష్కరించేందుకు ప్రధాని మోదీ దౌత్యపరమైన చొరవ తీసుకోవాలని కాంగ్రెస్ డిమాండ్
- అమెరికా అధ్యక్షుడు ట్రంప్, నెతన్యాహులను వ్యతిరేకించడం మోదీకి ఇష్టం లేదని ఎద్దేవా

## త్వరలో మంత్రివర్గ పునర్ వ్యవస్థీకరణ



- కేబినెట్‌లో పలు మార్పులు, చేర్పులు!
- అసెంబ్లీ సమావేశాలు ముగిశాక కసరత్తు
- ఇద్దరు, ముగ్గురు మంత్రులకు ఉద్వాసన పలికే ఛాన్స్
- అజారుద్దీన్‌కు ఇప్పటివరకు దక్కని ఎమ్మెల్సీ
- ఉత్తర, దక్షిణ తెలంగాణ సమతుల్యతను దృష్టిలో పెట్టుకుని నిర్ణయాలు

హైదరాబాద్

ఏప్రిల్, మే నెలల్లో రాష్ట్ర మంత్రివర్గంలో మార్పులు, చేర్పులు ఉంటాయని కాంగ్రెస్ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతోంది. మంత్రుల పని తీరు, సామాజిక వర్గాలు, ప్రాంతీయ సమతుల్యత ఈ మూడు అంశాలే ప్రామాణికంగా కేబినెట్ పునర్ వ్యవస్థీకరణకు ఏఐసీసీ పచ్చజెండా ఊపినట్లు పీసీసీ వర్గాలు చెబుతున్నాయి. మంత్రివర్గంలో నుంచి ఎవరిని తొలిగిస్తారు? ఎవరిని కొత్తగా చేర్చుకుంటారన్న అంశంపై ఇప్పటికైతే స్పష్టత లేదు. ఇప్పటికీ పూర్తిస్థాయిలో విస్తరించని మంత్రివర్గం : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి దాదాపు రెండేళ్లు దాటింది. అయితే ఇప్పటికీ - మిగతా3లో



## మండిపోతున్న మెట్రో ఛార్జీలు!

- దిల్లీలో కంటే ఇక్కడే ఎక్కువ
- దేశంలోని వివిధ నగరాల్లో మెట్రో ఛార్జీల సవరణలు
- దిల్లీలో తక్కువ - హైదరాబాద్ నగరంలో అధికం
- మెట్రో ఛార్జీలతో ప్రయాణం భారం!
- హైదరాబాద్ మెట్రో ఛార్జీలు ఎలా ఉన్నాయంటే?

హైదరాబాద్

దిల్లీ మెట్రో ప్రపంచంలోనే అత్యంత చౌకైన రవాణా వ్యవస్థల్లో ఒకటిగా నిలుస్తోంది. దేశ రాజధాని ప్రాంతం (ఎన్‌సీఆర్)లో విస్తృతమైన మెట్రో నెట్‌వర్క్ ఉంది. విస్తరణపరంగా వెనకబడిన హైదరాబాద్ మెట్రోలో ప్రయాణ ఛార్జీలు ఏమో దిల్లీ మెట్రో కన్నా ఎక్కువగా ఉన్నాయి. మెట్రో విస్తరణ ఎంత ప్రధానమో, ప్రయాణ ఛార్జీలు అందుబాటులో ఉండటం అంతే ముఖ్యమని ప్రయాణికులు అభిప్రాయపడుతున్నారు. మెట్రోలో - మిగతా3లో



## ఇరాన్‌కు కశ్మీరీలు భారీ సాయం

- నగదు, బంగారం, నిత్యావసరాలు విరాళం
- కృతజ్ఞతలు తెలిపిన ఎంబసీ
- యుద్ధంతో ప్రభావితమైన ఇరాన్ ప్రజలకు కశ్మీర్ ప్రజలు సాయం
- నగదు, బంగారు, వెండి వస్తువులను సేకరించి పంపించిన ప్రజలు
- పోస్ట్ చేసిన ఇరాన్ ఎంబసీ

# ప్రపంచంలో ఎక్కడ సమస్య వచ్చినా భారత్‌పై ప్రభావం

పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధ పరిస్థితులు ప్రపంచవ్యాప్తంగా ఆందోళన కలిగిస్తున్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఆ సంక్షోభం ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై మాత్రమే కాకుండా ప్రజల జీవన విధానంపై కూడా తీవ్ర ప్రభావం చూపుతోందని ఆయన అన్నారు. సోమవారం లోక్‌సభలో ఆ అంశంపై మాట్లాడిన ప్రధాని, పరిస్థితులు ఆందోళనకరంగా ఉన్నాయని స్పష్టం చేశారు.

అమెరికా–ఇజ్రాయెల్– ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో ఆ యుద్ధం నాలుగో వారంలోకి ప్రవేశించింది. దీని ప్రభావం భారత్‌పై కూడా పలు రంగాల్లో కనిపిస్తుందని మోదీ చెప్పారు. ముఖ్యంగా ఆర్థిక, భద్రతా, మానవతా కోణాల్లో సవాళ్లు ఎదురవుతున్నాయని వివరించారు. భారత్‌కు అవసరమైన ముడి చమురు, సహజ వాయువు (గ్యాస్)లో పెద్ద భాగం పశ్చిమాసియా దేశాల నుంచే వస్తుందని ప్రధాని గుర్తు చేశారు. ఆ ప్రాంతం ఇతర దేశాలతో వాణిజ్యానికి కీలక మార్గంగా కూడా పనిచేస్తుందని చెప్పారు. అందువల్ల అక్కడి పరిస్థితులు దిగుమతులు, ఎగుమతులు, సముద్ర మార్గ రవాణాపై ప్రభావం చూపుతున్నాయని వివరించారు.

హర్మూజ్ జలసంధి ద్వారా భారత్‌కు భారీ స్థాయిలో చమురు, గ్యాస్, ఎరువులు వంటి కీలక వస్తువులు రవాణా అవుతున్నాయని తెలిపారు. అయితే యుద్ధ పరిస్థితుల వల్ల ఆ మార్గంలో నౌకల రాకపోకలు కష్టతరంగా మారాయని అన్నారు. అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకుని పెట్రోల్, డీజిల్, గ్యాస్ సరఫరా అంతరాయం కలగకుండా చూసిందని మోదీ స్పష్టం చేశారు. దేశంలో ఎల్‌పీజీ వినియోగం ఎక్కువగా దిగుమతులపై ఆధారపడి ఉందని ఆయన తెలిపారు. సుమారు 60 శాతం ఎల్‌పీజీ అవసరాలు దిగుమతుల ద్వారానే నెరవేరుతున్నాయని చెప్పారు. ప్రస్తుత పరిస్థితుల్లో దేశీయ వినియోగదారులకు ప్రాధాన్యం ఇచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని,



అంతేకాకుండా దేశీయ ఉత్పత్తిని కూడా పెంచుతున్నామని వెల్లడించారు.

పశ్చిమాసియాలో దాదాపు ఒక కోటి మంది భారతీయులు నివసిస్తూ పనిచేస్తున్నారని ప్రధాని గుర్తు చేశారు. అలాగే వాణిజ్య నౌకల్లో కూడా పెద్ద సంఖ్యలో భారతీయ సిబ్బంది ఉన్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో అక్కడి పరిస్థితులపై భారత్‌కు సహజంగానే ఎక్కువ ఆందోళన ఉంటుందని చెప్పారు. యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి అక్కడ ఉన్న భారతీయుల భద్రతను అత్యంత ప్రాధాన్యంగా తీసుకుంటున్నామని మోదీ తెలిపారు. ఇప్పటికే పశ్చిమాసియా దేశాల అధినేతలతో రెండు దఫాలుగా మాట్లాడినట్లు చెప్పారు. భారతీయుల భద్రతకు వారు హామీ ఇచ్చారని వెల్లడించారు.

**భారతీయులకు 24 గంటల హెల్ప్‌లైన్లు, ఎమర్జెన్సీ సేవలు**

సంక్షోభం సమయంలో ఇప్పటివరకు 3.75 లక్షల మంది భారతీయులు సురక్షితంగా స్వదేశానికి చేరుకున్నారని తెలిపారు. ఇరాన్ నుంచి మాత్రమే దాదాపు వెయ్యి మంది తిరిగి వచ్చినట్లు చెప్పారు. అందులో 700 మందికి పైగా వైద్య విద్యార్థులు ఉన్నారని వెల్లడించారు. యుద్ధ ప్రభావిత ప్రాంతాల్లో కొన్ని మరణాలు, గాయాలు సంభవించాయని ప్రధాని విచారం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. విదేశాల్లో ఉన్న భారతీయులకు 24 గంటల హెల్ప్‌లైన్లు, ఎమర్జెన్సీ సేవలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు.

ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని గల్ఫ్ దేశాల్లో సీబీఎస్ఈ 10, 12వ తరగతి పరీక్షలను రద్దు చేసినట్లు మోదీ పేర్కొన్నారు. విద్యలో అంతరాయం లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి సంక్షోభాలను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలు రూపొందించిందని ప్రధాని వివరించారు. దేశంలో వ్యూహాత్మక పెట్రోలియం నిల్వలను గణనీయంగా పెంచినట్లు చెప్పారు. ప్రస్తుతం భారత్ వద్ద 5.3 మిలియన్ మెట్రిక్ టన్నుల కంటే ఎక్కువ నిల్వలు ఉన్నాయని, వాటిని 6.5 మిలియన్ మెట్రిక్ టన్నులకు పెంచే దిశగా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు.

అదేవిధంగా గతంలో 27 దేశాల నుంచి మాత్రమే ఇంధనాన్ని దిగుమతి చేసుకునే భారత్, ఇప్పుడు 41 దేశాల నుంచి దిగుమతులు చేసుకుంటోందని మోదీ చెప్పారు. ఇది సరఫరా భద్రతను పెంచేందుకు తీసుకున్న ముఖ్యమైన నిర్ణయమని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఏర్పడుతున్న క్లిష్ట పరిస్థితులు దీర్ఘకాలిక ప్రభావం చూపే అవకాశం ఉందని ప్రధాని హెచ్చరించారు. కాబట్టి దేశం ఐక్యంగా ఉండి ఈ సవాళ్లను ఎదుర్కొవాలని పిలుపునిచ్చారు. కరోనా సమయంలో చూపిన ఐక్యతను మరోసారి ప్రదర్శించాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు.

# ‘ఈ ఏడాది అమెరికాలో జరగబోయే జీ20 సమ్మిట్ వల్ల నో యూజ్’

పశ్చిమాసియాలో నెలకొన్న సంక్షోభాన్ని పరిష్కరించేందుకు దౌత్యపరమైన చొరవ కోసం స్వయం ప్రకటిత ‘విశ్వగురు’ అయిన భారత ప్రధాని నరేంద్ర మోదీ బ్రిక్స్ సదస్సును ఎందుకు ముందుకు తీసుకెళ్లడం లేదని కాంగ్రెస్ మండిపడింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహులను వ్యతిరేకించడం మోదీకి ఇష్టం లేదని ఆరోపించింది. ఈ మేరకు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి (కమ్యూనికేషన్స్ ఇన్‌ఛార్జ్) జైరాం రమేశ్ ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. “ఈ ఏడాది చివర్లో భారత్ అధ్యక్షతన దిల్లీలో 18వ వార్షిక బ్రిక్స్ సదస్సు జరగనుంది. ఇందులో బ్రెజిల్, రష్యా, భారత్, చైనా, దక్షిణాఫ్రికా, అర్జెంటీనా, ఈజిప్ట్, ఇథియోపియా, సౌదీ అరేబియా, ఇరాన్, యూఏఈ సభ్య దేశాలుగా ఉన్నాయి. పశ్చిమాసియా సంక్షోభాన్ని, దాని ప్రభావాలను ఎదుర్కోవడానికి ఒక దౌత్యపరమైన చొరవ తీసుకునేందుకు ఉద్దేశించిన శిఖరాగ్ర సమావేశాన్ని స్వయం ప్రకటిత ‘విశ్వగురు’ అయిన ప్రధాని మోదీ ఎందుకు ముందుకు తీసుకెళ్లడం లేదు? దీన్ని బట్టి మోదీకి యూఎస్ అధ్యక్షుడు ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహులను వ్యతిరేకించడం ఇష్టం లేదని స్పష్టంగా అర్థమవుతోంది” అని జైరాం రమేశ్ విమర్శించారు.

పశ్చిమాసియాలోని పరిస్థితులపై చర్చించడానికి భారత ప్రధాని నరేంద్ర మోదీ విదేశీ నాయకులకు ఫోన్ కాల్స్ చేస్తున్నారని జైరాం రమేశ్ తెలిపారు. “ఈ సంభాషణలలో మన ఎల్ సుప్రీమోకు (మోదీకి) ఆలింగనాలు ఉండవు. చేతి వేలు ఊపుతూ, జ్ఞానబోధ చేస్తూ ఫొటోలు దిగే అవకాశాలు ఉండవు. అయితే శిఖరాగ్ర సమావేశాల్లో విలువైన



ముఖాముఖి చర్చలు జరపొచ్చు. ఏదైనా సంక్షోభానికి సంబంధించిన నిర్దిష్టమైన చర్యలను తీసుకోవచ్చు. ఈ ఏడాది జీ20కి అమెరికా అధ్యక్షత వహిస్తోంది. అప్పుడు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరిన్ని ఆవేశపూరిత ప్రసంగాలు, ఎగతాళి మాటలు తప్ప ఆ సమ్మిట్ వల్ల చెప్పుకోదగ్గ ఫలితాలేమీ ఉండవు” అని జైరాం రమేశ్ పేర్కొన్నారు.

**దౌత్యపరమైన పరిష్కారం కావాలి: మనీశ్ తివారీ**

పశ్చిమాసియా సంఘర్షణ కారణంగా సరఫరా గొలుసులో ఏర్పడుతున్న అంతరాయాలపై కాంగ్రెస్ ఎంపీ మనీశ్ తివారీ ఆందోళన వ్యక్తం చేశారు. దీనికి దౌత్యపరమైన పరిష్కారం కావాలని పిలుపునిచ్చారు. ముడి చమురు, సహజ వాయువు, ఎరువులు, ఆహారం, ఔషధాల సరఫరా గొలుసు అంతరాయం వల్ల కలిగే పరిణామాలను ప్రస్తావించారు. ఇంధనాన్ని వినియోగించే దేశాలు ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి ప్రశ్నలు లేవనెత్తారు.

**‘అక్కడ నిరుపయోగంగా మూడు వేల నౌకలు’**

“పశ్చిమాసియా సంక్షోభం అత్యంత ప్రమాదకరమైన దశలోకి ప్రవేశించింది. గల్ఫ్ ఆప్ ఒమన్ , పర్షియన్ గల్ఫ్‌లో 3000 నౌకలు నిరుపయోగంగా ఉన్నాయి. ఇజ్రాయెల్, అమెరికా, ఇరాన్ తమ ఉద్రిక్తతలను తగ్గించుకోవాలి. దౌత్య మార్గం ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలి. ఇంధనాన్ని వినియోగించే దేశాల్లో పరిస్థితి అంతకంతకు దిగజారుతోంది. ఎందుకంటే ఇది కేవలం ముడి చమురు, సహజ వాయువుకు సంబంధించిన విషయం మాత్రమే కాదు. ఎరువులు, ఆహారం, ఔషధాలు, ప్రాణాలను కాపాడే అత్యవసర మందులకు కూడా సంబంధించినది. మొత్తం సరఫరా గొలుసు దెబ్బతింది” అని మనీశ్ తివారీ పేర్కొన్నారు.

**మోదీ అధ్యక్షతన మీటింగ్**

కాగా, పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితుల వేళ ప్రధాని మోదీ అధ్యక్షతన ఆదివారం సాయంత్రం భద్రత వ్యవహారాల క్యాబినెట్ కమిటీ (సీసీఎస్) సమావేశం జరిగింది. ఈ మీటింగ్‌లో దేశంలో పెట్రోలియం, విద్యుత్, ఎరువుల రంగాల స్థితిగతులపై సీనియర్ మంత్రులతో చర్చించారు మోదీ. ఈ సమావేశంలో కేంద్రమంత్రులు అమిత్ షా, రాజ్ నాథ్ సింగ్, జేపీ నడ్డా, శివరాజ్ సింగ్ చౌహాన్, నిర్మలా సీతారామన్, జైశంకర్, రామ్మోహన్ నాయుడు, హర్దీప్ సింగ్ పురి, సర్బానంద సోనోవాల్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్ తదితరులు పాల్గొన్నారు. గ్యాస్, పెట్రోల్, ఎరువుల సరఫరాలో ఇబ్బందులు రాకుండా చూడాలని ప్రధాని మోదీ ఆదేశించారు.

# దేశీయ విమానయాన సంస్థల సమ్మర్ షెడ్యూల్ రిలీజ్ చేసిన డీజీసీఏ

దేశీయ విమానయాన సంస్థల వేసవి విమాన సర్వీసుల షెడ్యూల్‌ను డైరెక్టరేట్ జనరల్ ఫర్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) విడుదల చేసింది. ప్రయాణికులు సంబంధిత విమానయాన సంస్థల వెబ్‌సైట్‌ను సరిచూసుకోవాలని సూచించింది. అలాగే కార్యాచరణ అత్యవసర పరిస్థితుల కారణంగా చివరి నిమిషంలో విమాన షెడ్యూల్‌లో మార్పులు జరిగితే ఆయా విమానయాన సంస్థలను సంప్రదించాలని కోరింది. ఈ మేరకు మార్చి 29 నుంచి అక్టోబర్ 24 వరకు వర్తించే దేశీయ విమాన సర్వీసుల సమ్మర్ షెడ్యూల్‌ను సోమవారం రిలీజ్ చేసింది.

**విమాన ఛార్జీలపై పరిమితులు ఎత్తివేత**

దేశీయ విమాన ఛార్జీలపై విధించిన తాత్కాలిక పరిమితులను ఎత్తివేస్తున్నట్లు కేంద్ర పౌర విమానయాన శాఖ ఆదివారం ప్రకటించింది. ఈ నిర్ణయం మార్చి 23 (సోమవారం) నుంచి అమల్లోకి వస్తుందని తెలిపింది. గతేడాది డిసెంబర్‌లో ఇండిగో సంక్షోభం కారణంగా ప్రభుత్వం విధించిన ఈ పరిమితులను తొలగిస్తున్నట్లు పేర్కొంది. విమాన టికెట్ల ధరలపై పరిమితులు ఇకపై అవసరం లేదని తెలియజేస్తూ కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖ ఓ ఉత్తర్వును ఆదివారం జారీ చేసింది. కాగా, ఈ నిర్ణయం మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా విమాన టికెట్ ధరలను నిర్ణయించుకోవడానికి విమానయాన సంస్థలకు అనుమతిస్తుంది. “ఇండిగో విమాన సర్వీసులకు భారీ స్థాయిలో అంతరాయం కలగడం వల్ల టికెట్ల ధరలలో తలెత్తే అసాధారణ పెరుగుదలను అరికట్టేందుకు గతేడాది డిసెంబరు 6న విమాన ఛార్జీలపై తాత్కాలిక పరిమితులు విధించాం. ప్రయాణీకుల ప్రయోజనాలను కాపాడడానికి, విమాన టికెట్లు అందుబాటులో ఉండేలా చూసేందుకు ఆ నిర్ణయం తీసుకున్నాం. ప్రస్తుతం విమానసంస్థల కార్యకలాపాలు సద్దుమణిగాయి.



అందుకే గతేడాది డిసెంబర్‌లో విధించిన ఛార్జీల పరిమితిని 2026 మార్చి 23 నుంచి ఉపసంహరించుకుంటున్నాం.” అని కేంద్ర పౌర విమానయాన శాఖ పేర్కొంది.

**‘ధరల విషయంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలి’**

దేశీయ విమాన ఛార్జీలపై విధించిన తాత్కాలిక పరిమితులను ఎత్తివేసినప్పటికీ, విమానయాన సంస్థలు ధరల విషయంలో క్రమశిక్షణ పాటించాలని పౌర విమానయాన శాఖ స్పష్టం చేసింది. ఎయిర్‌లైన్స్ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరింది. విమాన ఛార్జీలు సహేతుకంగా, పారదర్శకంగా, మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా ఉండేలా చూసుకోవాలని సూచించింది. అలాగే ప్రయాణీకుల ప్రయోజనాలపై ప్రతికూల ప్రభావం పడకుండా చూడాలని విజ్ఞప్తి చేసింది. ముఖ్యంగా అధిక డిమాండ్, విమాన సర్వీసుల్లో అంతరాయాలు, ఇతర అత్యవసర పరిస్థితుల సమయాల్లో ఛార్జీలను అధికంగా పెంచిన ఏ సందర్భాన్నైనా తీవ్రంగా పరిగణిస్తామని హెచ్చరించింది. విమాన ఛార్జీలను పౌర విమానయాన శాఖ నిశితంగా పర్యవేక్షిస్తూనే ఉంటుందని పేర్కొంది.

**60శాతం సీట్లపై అదనపు ఛార్జీలు రద్దు!**

మరోవైపు, విమాన టికెట్ల అదనపు ఛార్జీల విషయంలో ఇటీవలే కేంద్ర పౌర విమానయాన శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. అన్ని విమానాల్లో కనీసం 60 శాతం సీట్లపై ఎలాంటి అదనపు ఛార్జీలు విధించకుండా ఉండేందుకు విమానయాన సంస్థలకు ఆదేశాలు జారీ చేసింది. ఆ అదేశాలపై దేశీయ విమానయాన సంస్థలు అసహనం వ్యక్తం చేశాయి. ఈ నిర్ణయంతో టికెట్ల ధరలను పెంచాల్సిన పరిస్థితి వస్తుందని పేర్కొన్నాయి. ఈ మేరకు ఇండిగో, ఎయిరిండియా, స్పైస్‌జెట్‌లకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఎయిర్‌లైన్స్ కేంద్ర పౌర విమానయాన శాఖకు లెటర్ రాసింది. విమానాల్లో కనీసం 60 శాతం సీట్లపై ఎలాంటి అదనపు ఛార్జీలు విధించకుండా ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలు తమ కీలక ఆదాయ మార్గానికి గండి కొట్టే విధంగా ఉన్నాయని ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఎయిర్‌లైన్స్ తెలిపింది. ఈ చర్యల వల్ల విమానయాన సంస్థలపై తీవ్ర ఆర్థిక భారం పడుతుందని ఆందోళన వ్యక్తం చేసింది. తాము కోల్పోయిన ఆదాయాన్ని తిరిగి రాబట్టుకోవడానికి విమానయాన సంస్థలు ఛార్జీలు పెంచాల్సి వస్తుందని పేర్కొంది. ప్రయాణికుల ప్రయోజనం కోసం తీసుకున్న నిర్ణయం చివరికి వారికే ప్రతికూలంగా మారే అవకాశం ఉందని చెప్పింది. ఈ నిర్ణయం తరచుగా విమానాల్లో ప్రయాణించేవారికి మరింత నష్టం చేకూరుస్తుందని అభిప్రాయపడింది. ధరల నిర్ణయం, సీట్ల కేటాయింపు అనేవి కీలకమైన వ్యాపార నిర్ణయాలని స్పష్టం చేసింది.

## డీఎంకేదే అధికారం



త్వరలో జరగబోయే తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో అధికార డీఎంకే కూటమి ప్రభంజనం సృష్టించనుందని చెన్నై కేంద్రంగా పనిచేసే ‘అగ్ని న్యూస్ సర్వీస్’ అనే సర్వే సంస్థ తేల్చింది. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే కూటమి 44.9శాతం ఓట్లను సాధిస్తుందని పేర్కొంది. రాష్ట్రంలోని మొత్తం 234 నియోజకవర్గాల్లో 180 స్థానాలను అధికార కూటమి కైవసం చేసుకునే అవకాశం ఉందని అంచనా వేసింది. విపక్ష అన్నాడీఎంకే కూటమికి మరోసారి ఎదురుదెబ్బ తగలనుందని సర్వే సంస్థ వెల్లడించింది. ఈ కూటమి 38.5శాతం ఓట్లను సాధించి, 54 సీట్లకే పరిమితమయ్యే ఛాన్స్ ఉందని స్పష్టం చేసింది.

**అన్నాడీఎంకేకి షాక్!**

అన్నాడీఎంకే కూటమికి ఈ ఎన్నికల్లో చెన్నై రీజియన్‌లో ఎదురుదెబ్బ తగలనున్నట్లు ‘అగ్ని న్యూస్ సర్వీస్’ అనే సర్వే సంస్థ అంచనా వేసింది. ఆ ప్రాంతంలో ఒక్క సీటు కూడా అన్నాడీఎంకే కూటమి గెలవదని పేర్కొంది. మధ్య తమిళనాడు ప్రాంతంలో పళనస్వామి నేతృత్వంలో కూటమి కేవలం 2 సీట్లు మాత్రమే దక్కించుకుంటుందని వెల్లడించింది. దీంతో అన్నాడీఎంకే కూటమి మరోసారి భారీ ఓటమిని చవిచూసే అవకాశం ఉందని స్పష్టం చేసింది.

**టీవీకే ప్రభావం అంతంతమాత్రమే!**

సినీనటుడు విజయ్ స్థాపించిన తమిళగ వెట్రి కజగం (టీవీకే) పార్టీ ఈ ఎన్నికల్లో అంతంతమాత్రమే ప్రభావితం చూపిస్తుందని సర్వే సంస్థ ‘అగ్ని న్యూస్ సర్వీస్’ అంచనా వేసింది. 9.7శాతం ఓట్లను టీవీకే సాధిస్తుందని వెల్లడించింది. అలాగే, సీమాన్ నేతృత్వంలోని నామ్ తమిళర్ కచ్చి పార్టీ 4.8శాతం ఓట్ల వాటాను పొందే ఛాన్స్ ఉందని, ఇతర పార్టీలు కలిపి 2.1శాతం ఓట్లను దక్కించుకుంటాయని సర్వే సంస్థ పేర్కొంది. రాబోయే ఎన్నికల్లో టీవీకే అధినేత విజయ్, నామ్ తమిళర్ కచ్చి పార్టీ ప్రధాన సమన్వయకర్త సీమాన్ ఇద్దరూ ఓటమిని చవిచూసే అవకాశం ఉందని అంచనా వేసింది.

## ఇరాన్‌కు కశ్మీరీలు భారీ సాయం



అమెరికా–ఇజ్రాయెల్ కలిసి ఇరాన్?పై దాడి చేయడంతో పశ్చిమాసియాలో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. ప్రతీకార దాడులతో యుద్ధం మరింత తీవ్రమవుతోంది. ఈ దాడుల వల్ల ఇరాన్?లోని చాలా ప్రాంతాలు దెబ్బతిన్నాయి. పాఠశాలలు, భవనాలు, ఆస్పత్రులు ధ్వంసమయ్యాయి. ఈ యుద్ధం వల్ల ఇప్పటికే 1000 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. అనేక మంది నిరాశ్రయులు అయ్యారు. ఈ క్రమంలో ఇరాన్?కు జమ్మూకశ్మీర్?లోని ప్రజలు భారీ సాయం అందించేందుకు ముందుకొచ్చారు. నగదు, బంగారు ఆభరణాలు, రాగి పాత్రలు వంటి పంపించారు. ఇందుకు భారత్?లోని ఇరాన్ రాయబార కార్యాలయం కృతజ్ఞతలు తెలిపింది. యుద్ధంతో ప్రభావితమైన ఇరాన్ ప్రజలకు సహాయం చేయడానికి కశ్మీర్ ప్రజలు పెద్ద ఎత్తున విరాళాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్యంగా షియాలు అధికంగా ఉన్న బుద్గామ్, బారాముల్లా జిల్లాల్లో ఈ కార్యక్రమాన్ని మొదలుపెట్టారు. రంజాన్ మరుసటి రోజు ఆదివారం భారీ విరాళాలు వచ్చాయి. ప్రజలు నగదు మాత్రమే కాకుండా బంగారు ఆభరణాలు, పశువులు, సంప్రదాయ రాగి పాత్రలు వంటి విలువైన వస్తువులను కూడా విరాళంగా అందించారు.

**ఇంటింటికీ వెళ్లి సేకరణ**

ఇరానీయులకు సాయం చేసేందుకు ఇంటింటికి వెళ్లి విరాళాలు సేకరించారు. ఈ విరాళాల సేకరణ కార్యక్రమంలో పిల్లల దగ్గర నుంచి పెద్ద వరకు, మహిళలు, పురుషులు అందురు పాల్గొన్నారు. మహిళలు తమ బంగారు ఆభరణాలను విరాళంగా ఇచ్చారు. అలాగే ఇళ్లలోని విలువైన వస్తువులను, కొందరు తమ పశువులను కూడా సాయంగా ఇచ్చారు. పిల్లలు సైతం తమ పొదుపు నగదును, ఈద్ సందర్భంగా పొందిన డబ్బును ఇచ్చారు.

**‘వారికి సాయం చేయడం మన బాధ్యత’**

ఇరాన్? ప్రజలకు సాయం చేయడానికి ఈ విరాళాల కార్యక్రమాన్ని చేపట్టినట్లు శ్రీనగర్?లోని రైనావారి ప్రాంతానికి చెందిన అజాబ్? అహ్మద్ ఓ వార్త సంస్థకు తెలిపారు. ఈ యుద్ధం వల్ల ఇరాన్?లో భారీ విధ్వంసం జరిగిందని పేర్కొన్నారు. ఈ దాడుల వల్ల బాధపడుతున్న ప్రజలకు సహాయం మన బాధ్యత అని చెప్పారు.

**ఇరాన్ ఎంబసీ కృతజ్ఞతలు**

ఇది కేవలం సాయం మాత్రమే కాదని భావోద్వేగ అనుబంధాన్ని కూడా చూపించిందని భారత్?లోని ఇరాన్ రాయబార? కార్యాలయం పేర్కొంది. విరాళాల ఫొటోలను పంచుకుంటూ ఎక్స్?లో పోస్ట్ చేసింది. కశ్మీర్ ప్రజల మానవత్వం, సాయం తమకు ఎప్పటికీ గుర్తుండిపోతాయని పేర్కొంది. కశ్మీర్? ప్రజలకు హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలుపుతున్నామని చెప్పింది.

## సొంత నిర్ణయాలు తీసుకునే స్థితిలో భారత్ లేదు

**అంతా అమెరికా చేతిలోనే- కేరళ సీఎం పినరయి విజయన్**

పశ్చిమాసియా ఉద్రిక్తతలతో దేశంలో పెరుగుతున్న వంటగ్యాస్ ధరలు, కుదేలవుతున్న చిన్న తరహా పరిశ్రమలు, అంతర్జాతీయ వేదికపై భారత విదేశాంగ విధానంపై కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. బీజేపీ నేతృత్వంలోని భారత ప్రభుత్వం ప్రస్తుతం స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకోలేని పరిస్థితిలో ఉందని కేరళ సీఎం పినరయి విజయన్ ఆరోపించారు. సొంత వ్యూహాత్మక నిర్ణయాల కోసం అమెరికా ఆమోదం కోసం భారత్ వేచి చూసే పరిస్థితి దాపురించిందని దుయ్యబట్టారు. ఇది భారత సార్వభౌమాధికారానికి పెను ముప్పుగా ఆయన అభివర్ణించారు. కేంద్ర ప్రభుత్వం అమెరికా ప్రయోజనాలకు అనుగుణంగా నడుచుకుంటోందని, దీనివల్ల అంతర్జాతీయ స్థాయిలో భారత్ తన స్వతంత్రతను కోల్పోతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం కన్నూర్‌లో జరిగిన ఒక బహిరంగ సభలో మాట్లాడిన ఆయన, బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై ధ్వజమెత్తారు. కేంద్రం దేశ సార్వభౌమాధికారాన్ని అమెరికా వద్ద తాకట్టు పెండుతోందని మండిపడ్డారు.

# త్వరలో మంత్రివర్గ పునర్ వ్యవస్థీకరణ

-మొదటిపేజీ తరువాయి

పూర్తిస్థాయిలో మంత్రివర్గ విస్తరణ జరగలేదు. సామాజిక సమీకరణాలు కుదరకపోవడం, నేతల మధ్య పోటీ, ముఖ్య నాయకుల మధ్య ఏకాభిప్రాయం లేకపోవడం వంటి కారణాలతో ముందుకెళ్లలేని పరిస్థితి. 119 మంది ఎమ్మెల్యేలకు 15 శాతం అంటే ముఖ్యమంత్రితో కలిపి 18 మందిని కేబినెట్‌లోకి తీసుకునే అవకాశం ఉంది. ప్రస్తుతం 16 మంది మంత్రులు ఉన్నారు. ఇటీవల జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక సమయంలో అజారుద్దీన్ ప్రజాప్రతినిధి కాకపోయినా ఏఐసీసీ సూచనల మేరకు మంత్రివర్గంలో చోటు ఇచ్చారు. ఏప్రిల్ 30లోపు ఆయన ఎమ్మెల్సీగా ఎన్నిక కానట్లయితే మంత్రి పదవి నుంచి దూరం కావాల్సి వస్తుంది. ఆలోపు ఏదో ఒక విధంగా సర్దుబాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

మంత్రులకు ఉద్వాసన పలికే ఛాన్స్ : కొందరు మంత్రులపై అధిష్ఠానం అసంతృప్తిగా ఉన్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. పార్టీ నిర్దేశించిన నియమావళికి కట్టుబడకపోవడం, ఎమ్మెల్యేలకు అందుబాటులో ఉండకపోవడం, వర్గాలను పెంచి పోషించడం వంటి ఆరోపణలు కొందరు మంత్రులపై గట్టిగా వినిపిస్తున్నాయి. దీంతో రేవంత్ కేబినెట్‌లోని ఇద్దరు, ముగ్గురు మంత్రులకు ఉద్వాసన ఉంటుందనే ప్రచారం జోరుగా సాగుతోంది. అయితే ఈ ప్రక్రియలో అంతర్గత ఇబ్బందులు తలెత్తకుండా ఉండేలా పార్టీ హైకమాండ్ కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది.

### అసెంబ్లీ సమావేశాలు ముగిశాక

ఏప్రిల్, మే నెలల్లో మంత్రివర్గ పునర్ వ్యవస్థీకరణ జరిగే అవకాశాలున్నాయని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అసెంబ్లీ సమావేశాలు ముగిసిన తర్వాత ఇందుకు సంబంధించిన కసరత్తు వేగవంతమవుతుందని అంచనా వేస్తున్నారు. ఖాళీగా ఉన్న రెండు మంత్రి పదవులు భర్తీ చేయడంతో పాటు, ప్రస్తుత మంత్రుల్లో ఇద్దరు, ముగ్గురికి ఉద్వాసన పలుకుతారని చెబుతున్నారు. మున్నూరు కాపు సామాజిక వర్గం నుంచి ఆది



శ్రీనివాస్‌ను మంత్రివర్గంలోకి తీసుకుంటారని, కుదరని పక్షంలో చీఫ్ విప్ పదవి ఇస్తారని ప్రచారం సాగుతోంది. ఏఐసీసీ హామీ ఇచ్చి తనను పార్టీలోకి చేర్చుకుందని చెబుతూ వస్తున్న రాజగోపాల్ రెడ్డికి మంత్రివర్గంలో బెర్త్ దక్కే అవకాశం కనిపిస్తోంది.

### ఎంపికపై అధిష్ఠానం కసరత్తు :

లంబాడీల కోటా కింద మంత్రివర్గంలో చోటు కావాలని అధిష్ఠానం వద్ద ఈ సామాజిక వర్గం నేతలు పట్టుబడుతున్నారు. ప్రభుత్వ విప్‌గా ఉన్న రామచంద్రనాయక్, దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్‌లలో ఎవరో ఒకరిని కేబినెట్‌లోకి తీసుకునే అవకాశం కనిపిస్తోంది. బాలు నాయక్‌కు డిప్యూటీ స్పీకర్ పదవి ఇవ్వాలని భావించినా, ఆ జిల్లా నుంచి ఇద్దరు మంత్రులు ఉండటంతో రాజకీయ సమీకరణాలు కుదరలేదు. మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిలు కూడా మంత్రి పదవి కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. డిప్యూటీ స్పీకర్ కోసం కూడా ఎవరిని ఎంపిక చేయాలనే అంశంపై అధిష్ఠానం కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది.

### మంత్రివర్గాన్ని మరింత పటిష్ఠ పరచాలని

మంత్రివర్గ మార్పులు, చేర్పుల్లో ఉత్తర--దక్షిణ తెలంగాణ సమతుల్యతను దృష్టిలో పెట్టుకుని నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉందని తెలుస్తోంది. మార్పులు, చేర్పుల ద్వారా మంత్రివర్గాన్ని మరింత పటిష్ఠ పరచాలని అధిష్ఠానం భావిస్తోంది. సీఎం రేవంత్ రెడ్డి మాత్రం ప్రస్తుత మంత్రివర్గంతోనే ముందుకెళ్లడం ద్వారా అసంతృప్తి రాకుండా పాలనాపరంగా మరింత బలం చేకూరుతుందని సర్దిచెప్పే ప్రయత్నాలు చేస్తున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

# ఇక పారిశ్రామిక ప్రగతి పరుగులే

హైదరాబాద్ : రాష్ట్రాన్ని ప్రపంచ స్థాయి పారిశ్రామిక శక్తిగా తీర్చిదిద్దే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం 2026-27 బడ్జెట్‌లో పరిశ్రమలు , ఐటీ శాఖలకు అత్యంత ప్రాధాన్యతనిచ్చింది. ఐటీ రంగానికి నిధులను పెంచుతూ రూ. 875 కోట్లు కేటాయించగా, పరిశ్రమల శాఖకు రూ. 3,490 కోట్లు ప్రతిపాదించింది. కేవలం హైదరాబాద్ పశ్చిమ ప్రాంతానికే పరిమితం కాకుండా, నగరం చుట్టూ ఐటీని విస్తరించేలా 'గ్రిడ్'విధానానికి ప్రభుత్వం పెద్దపీట వేసింది.


గ్లోబల్ హబ్ గా హైదరాబాద్: దేశంలోని మొత్తం గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లలో20% హైదరాబాద్‌లోనే ఉండటం విశేషం. గతేడాది కొత్తగా 70 జీసీసీలు ఇక్కడ కొలువుదీరాయి. గూగుల్ వంటి టెక్ దిగ్గజం తన 'సేఫ్టీ ఇంజినీరింగ్ సెంటర్'ను ఇక్కడ నెలకొల్పడం గమనార్హం.

టీ-ఫైబర్ లక్ష్యం: ఇప్పటికే 8,888 గ్రామ పంచాయతీలు, 4,800 ప్రభుత్వ సంస్థలకు హై-స్పీడ్ ఇంటర్నెట్ అందించిన ప్రభుత్వం, ఈ ఏడాది చివరి నాటికి ఆ సంఖ్యను 50 వేలకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంది.ఎగుమతుల జోరు: రాష్ట్ర ఐటీ ఎగుమతులు రూ. 3.13 లక్షల కోట్లకు చేరాయి. వీటి ద్వారా 9.39 లక్షల మందికి పైగా ఉపాధి లభిస్తోంది. డేటా సెంటర్ ఆధునీకరణకు రూ. 100 కోట్లు కేటాయించారు.

పారిశ్రామిక ప్రగతి ? కొత్త హబ్‌లు:

కొడంగల్ ఇండస్ట్రియల్ పార్క్: పశ్చిమ తెలంగాణలోని కొడంగల్‌ను ప్రధాన పారిశ్రామిక కేంద్రంగా మార్చేందుకు 'మల్టీ పర్పస్ ఇండస్ట్రియల్ పార్క్'ను అభివృద్ధి చేయనున్నారు. రేడియల్ రోడ్-2 సమీపంలో దీనికోసం భూములను సమీకరిస్తున్నారు.

జహీరాబాద్ స్మార్ట్ సిటీ: కేంద్ర సహకారంతో 3,245 ఎకరాల్లో జహీరాబాద్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ ప్రాజెక్టును వేగవంతం చేస్తున్నారు.జిల్లా కారిడార్లు: హైదరాబాద్ మినహా మిగిలిన 9 ఉమ్మడి జిల్లాల్లో కొత్త పారిశ్రామిక కారిడార్ల అభివృద్ధికి రూ. 146.50 కోట్లు, గ్రామీణ చిన్నతరహా పరిశ్రమలకు రూ. 241.96 కోట్లు కేటాయించారు. హైదరాబాద్‌లో నిర్మిస్తున్న 'యూనిటీ మాల్' కోసం రూ. 173.16 కోట్లు ప్రతిపాదించారు.




ఎగుమతుల్లో రికార్డు వృద్ధి:

తెలంగాణ పారిశ్రామిక ఎగుమతులు గతేడాది కంటే 39.30% అద్భుత వృద్ధి సాధించి రూ. 1,61,843 కోట్లకు చేరాయి. దేశవ్యాప్త ఎగుమతుల్లో 4.37% వాటాతో తెలంగాణ 7వ స్థానంలో నిలిచింది. మన రాష్ట్రం నుంచి ప్రధానంగా అమెరికా (23.64%), యూఏఈ (11.74%) దేశాలకు ఔషధాలు, ఏరోస్పేస్, ఎలక్ట్రికల్ పరికరాలు ఎగుమతి అవుతున్నాయి.

**భవిష్యత్తు లక్ష్యాలు 2047 విజన్:**

డిఫెన్స్, ఏరోస్పేస్ హబ్: హైదరాబాద్‌ను దేశంలోనే అగ్రగామి ఏరోస్పేస్ హబ్‌గా నిలపాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. దీనికోసం 1,500 ఎంఎస్ఎంఈలను (ఓటఇ) ఒకే గొడుగు కిందికి తీసుకురానుంది.

లైఫ్ సైన్సెస్ పాలసీ: 2026-30 నూతన లైఫ్ సైన్సెస్ విధానాన్ని తీసుకురావడంతో పాటు, జీనోమ్ వ్యాలీని మరో 300 ఎకరాలకు విస్తరించనున్నారు.

మహిళా పారిశ్రామికవేత్తలకు చేయూత: 119 నియోజకవర్గాల్లో మహిళా పారిశ్రామికవేత్తల కోసం ప్రత్యేకంగా 'ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్'లను నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

# వివాదాల కౌశిక్ రెడ్డి

**కరీంనగర్ :** వివాదాలే ఆయన జోలికి వస్తున్నాయో..లేక ఆయనే ఏరి కోరి మరీ కాంటవర్సీల్లో వేలు పెడుతున్నారో తెలియదు కానీ..నిత్యం ఏదో ఒక ఇష్యూతో హడావుడి చేస్తుంటారు హుజురాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి. కాంగ్రెస్‌లో ఉన్నప్పటి నుంచి ఆయన వ్యవహారశైలి దూకుడుగా ఉంటూనే వస్తోంది. ఆ తర్వాత బీఆర్ఎస్‌లోకి వచ్చి ఎమ్మెల్యే అయ్యాక అనవసర విషయాల జోలికి వెళ్లి పార్టీని రచ్చకీడుస్తున్నారన్న చర్చ ఉంది. గతంలో అప్పటి గవర్నర్ తమిళసై పై చేసిన వాఖ్యలు దుమారాన్ని రేపడంతో..ఆ తర్వాత నాలుక కరుచుకున్నారు. ప్రభుత్వ ఉద్యోగులను బూతులు తిట్టారనే అలిగేషన్‌తో పాటు, బీజేపీ నేత ఈటల రాజేందర్‌పై ఏవో కామెంట్స్ చేసి రచ్చకు దారితీశారు.ఆ మధ్య జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌తో వాగ్వాదం కేసులో అరెస్ట్ అయి..చివరకు బెయిల్‌పై రిలీజ్ అయ్యారు. అరికెపూడి గాంధీని పరుష పదజాలంతో విమర్శించడంతో పోటాపోటీ ఫిర్యాదులకు, దాడులకు దారితీసింది. లేటెస్ట్‌గా తన నియోజకవర్గంలో సమ్మక్క సారలమ్మ జాతరలో రాద్దాంతం చేసి..రోడ్డుపై బైఠాయించి సీపీని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు కాంట్రవర్సీ అయ్యాయి. చివరకు ఐపీఎస్‌ల సంఘం డిమాండ్‌తో సారీ చెప్పాల్సి వచ్చింది. అప్పటి నుంచి కరీంనగర్ సీపీ గౌస్ ఆలంను టార్గెట్ చేస్తూ వస్తున్నారు కౌశిక్‌రెడ్డి. ఇదంతా ఆయన చేసిన రచ్చ, రాద్దాంతం అయితే..ఇప్పుడు సొంత పార్టీ నేతలే కౌశిక్‌రెడ్డి తీరుపై తిరుగుబావుట ఎగురవేస్తుండటం హాట్ టాపిక్‌గా మారింది.కౌశిక్ రెడ్డి తీరును నిరసిస్తూ హుజురాబాద్ బీఆర్ఎస్ నేతలు రహస్య సమావేశాలు ఏర్పాటు చేసుకోవడం హాట్ టాపిక్‌గా మారింది. ద్వితీయ శ్రేణి నాయకులను పట్టించుకోకపోవడం ఒక ఎత్తు అయితే, అధినేత దగ్గర తమను కనీసం పరిచయం కూడా చేయరని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కౌశిక్‌రెడ్డి దూకుడుతో డ్యామేజ్ అవుతుందని..జమ్మికుంట మండలానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు సమావేశం ఏర్పాటు చేసుకోవడం చర్చనీయాంశంగా మారింది. సీనియర్ లీడర్లపై కౌశిక్ వివక్ష చూపుతున్నారంటూ అసంతృప్త నేతలు గళం ఎత్తుతున్నారు.మున్సిపల్ ఎన్నికల్లో కౌశిక్ రెడ్డి తమకు అన్యాయం చేశారనేది వారి ప్రధాన ఆరోపణ. పార్టీ నిర్ణయాన్ని ధిక్కరించి పోటీ చేసిన వారికి, తనకు సాన్నిహిత్యంగా ఉండే వారికే కౌశిక్ మద్దతు తెలిపారని ఫైర్ అవుతున్నారు. హుజురాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ ఓటమికి కౌశిక్ రెడ్డి ఏకపక్ష నిర్ణయాలే కారణమని మండిపడుతోంది క్యాడర్. ఎప్పుడో ఓసారి హుజురాబాద్‌కు వచ్చి హడావిడి చేసి..ఆ తర్వాత తమను రోడ్డు మీద వదిలేసి వెళ్లిపోతారనేది కొందరు నాయకుల వాదన.వ్యక్తిగత ఎజెండాతో పాలిటిక్స్ చేస్తూ..ఏదో ఒక వివాదంలో తల దూరుస్తూ పార్టీని రచ్చకీడుస్తున్నాని కౌశిక్ వ్యతిరేకులు విమర్శిస్తున్నారు. క్యాడర్‌ను పట్టించుకోవడం లేదంటున్నారు. పొలిటికల్‌గా కౌశిక్ రెడ్డి దూకుడు పార్టీకి, ఆయనకు ఎంత మైలేజ్ తెచ్చి పెడుతుందో ఏమో గానీ..నెగిటివిటీనే ఎక్కువ అవుతుందన్న టాక్ ఉంది. బీఆర్ఎస్ ముఖ్యనేతలు కూడా కౌశిక్‌రెడ్డి తీరుపై గుసగుసలు పెట్టుకుంటున్నారట. ఆయన దూకుడు పార్టీకి ప్లస్ అవుతుందా? మైనస్ అవుతుందా? అనే దానిపై ఇంటర్నల్ డిస్కషన్ జరుగుతున్నట్లు టాక్. ఇప్పటికైనా కౌశిక్‌రెడ్డి తన తీరును మార్చుకుంటారో..ఎప్పటిలాగే దూకుడే ఎజెండాగా పెట్టుకుని వెళ్తారో చూడాలి.

## మూసీ అభివృద్ధిని ఆపేస్తాం అనకండి

-మొదటిపేజీ తరువాయి

ప్రతి కుటుంబంలో కార్లు పెరిగాయని, ట్రాఫిక్ రద్దీ పెరగడం వల్లే మెట్రో, ఎంఎంటీఎస్ విస్తరించుకున్నట్లు తెలిపారు. హైదరాబాద్, పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ బాగా పెరిగిందని, రాష్ట్రాన్ని మూడు ప్రాంతాలుగా విభజించి అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. క్యూర్, ప్యూర్, రేర్‌గా విభజించి ట్రాఫిక్ రద్దీ తగ్గేలా చూస్తున్నామన్న ఆయన, కాలుష్యం వెదజల్లే పరిశ్రమలను ఓఆర్ఆర్ బయటకు తరలిస్తామన్నారు. రోడ్లను అండర్ పాస్‌లు, సర్ఫేస్, ఎలివేటెడ్ కారిడార్లుగా విభజించామని, ఎక్కడా ట్రాఫిక్ ఆగకూడదనేదే తమ ప్రధాన లక్ష్యమన్నారు.

### మెట్రోను మరో 76 కిలోమీటర్లు

హైదరాబాద్‌లో మెట్రో విస్తరణకు ఎల్ అండ్ టీ కంపెనీ ముందుకు రాలేదన్న సీఎం, కేంద్ర ప్రభుత్వ నిబంధన వల్ల మెట్రోను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. రూ.15 వేల కోట్లు కేటాయించి మెట్రోను స్వాధీనం చేసుకున్నామని, మెట్రోను మరో 76 కిలోమీటర్లు విస్తరించనున్నట్లు తెలిపారు. హైదరాబాద్ నగర శివార్ల నుంచి వచ్చే ఉద్యోగుల సంఖ్య బాగా పెరిగిందన్న ఆయన, మెట్రో విస్తరణపై కేంద్రం కూడా సానుకూలంగా స్పందించిందని పేర్కొన్నారు. శామీర్‌పేట, మేడ్చల్ వైపు ఎలివేటెడ్ కారిడార్లు నిర్మిస్తామని, దానికోసం కేంద్ర సంస్థలతో మాట్లాడి భూమి తీసుకుంటున్నట్లు ప్రకటించారు. పైన విమానాలు ఎగిరితే, కింద అండర్ టన్నెల్ వచ్చేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

### రోడ్ల విస్తరణకు ఇబ్బందులు

జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ వంటి ప్రాంతాల్లో రోడ్ల విస్తరణకు ఇబ్బందులు ఉన్నాయని, వాహనాలు సిగ్నల్స్ వద్ద ఆగకుండా వెళ్లేలా చర్యలు తీసుకుంటున్నట్లు రేవంత్ రెడ్డి తెలిపారు. రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ఫుట్‌పాత్ ఆక్రమణలు తొలగిస్తున్నామని, అక్కడ ఉన్న చిరు వ్యాపారులకు ఇతర చోట్ల స్థలం కేటాయిస్తున్నట్లు వెల్లడించారు. హైదరాబాద్‌లో పలుచోట్ల మల్టీ లెవల్ కారు పార్కింగ్ ఏర్పాటు చేస్తున్నామని, హిల్ట్ పాలసీ కింద పరిశ్రమలకు వినియోగ మార్పిడీ చేస్తున్నట్లు వెల్లడించారు. ముందస్తు జాగ్రత్తలు తీసుకోకుంటే దిల్లీ మాదిరిగా హైదరాబాద్‌లో కాలుష్యం పెరిగిపోతుందని చెప్పారు. ఓఆర్ఆర్ లోపల పలుచోట్ల రేడియల్ రోడ్లు వేస్తున్నట్లు పేర్కొన్నారు. దూరం తగ్గించేందుకు ఎలివేటెడ్ కారిడార్లు వేస్తున్నామన్న సీఎం, సిటీ మధ్య నుంచి అన్ని ప్రాంతాలకు వెళ్లేలా ప్రణాళికలు చేస్తున్నట్లు తెలిపారు. ఎలివేటెడ్ కారిడార్ల వల్ల హైదరాబాద్ అద్భుత నగరంగా మారుతుందని చెప్పారు. డ్రైనేజీ వ్యవస్థను మారిస్తే మూసీ సుందరీకరణ త్వరగా పూర్తవుతుందన్న ఆయన, ప్యూర్ రీజియన్‌లో పరిశ్రమలు ఉంటాయని, 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీ నిర్మిస్తున్నట్లు తెలిపారు. ప్రత్యేక ప్రణాళిక ప్రకారం ముందుకెళ్తున్నామని, క్యూర్‌లో సర్వీస్ సెక్టార్, ప్యూర్‌లో ఇండస్ట్రియల్ సెక్టార్, రేర్‌లో అగ్రికల్చర్ సెక్టార్‌లు వస్తాయన్నారు.

### అలా అనొద్దు ప్లీజ్

ఆన్‌లైన్‌లోనే లెసెన్సులు రెన్యువల్ చేసుకునేలా చర్యలు తీసుకుంటున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. అభివృద్ధి విషయం వచ్చేసరికి అందరూ ఒక్కటి కావాలని సభ్యులకు సూచించారు. ఎన్నికలు వచ్చినప్పుడే రాజకీయాలు మాట్లాడదామని కోరారు. పరిపాలన అంతా ఒకే గొడుగు కిందకు తెచ్చామని చెప్పారు. మూసీ నది వల్ల నల్గొండ ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మంచి సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరుతున్నట్లు సూచించిన రేవంత్,? పనులు చేయనివ్వం, ఆపేస్తాం, అని మాత్రం అనవద్దని కోరారు. అవసరమైతే మీ సూచనలు, సలహాల కోసం మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం, డిప్యూటీ సీఎం భట్టి సారథ్యంలో కమిటీ వేస్తామని తెలిపారు. "మన నగరం ఎదుర్కొంటున్న సమస్యలు ప్రధానంగా మానవ తప్పిదాలే. రవాణాలో రోడ్లు, రైల్వే, ఎయిర్ పోర్ట్ వంటివి కీలక పాత్ర పోషిస్తాయి. తెలంగాణను మూడు జోన్లుగా విభజించడం జరిగింది. క్యూర్, ప్యూర్, రేర్‌గా చేసుకు న్నాం. అత్యధికంగా జనాభా వినియోగిస్తున్న మెట్రోను విస్తరించే దిశగా వెళ్తున్నాం"

## అది భస్మాసుర హస్తంగా మారింది

-మొదటిపేజీ తరువాయి

'కాంగ్రెస్ మేనిఫెస్టోలో ప్రతి ఎకరాకు రూ.15 వేలు ఇస్తామని హామీ ఇచ్చారు. ఇప్పుడు రూ.12 వేలు ఇస్తామని బడ్జెట్‌లో చెబుతున్నారు. ఈ ప్రభుత్వం రూ.19 వేల కోట్ల రైతు బంధు ఎగ్గొట్టింది. రాష్ట్రమంతా రైతు రుణమాఫీ అమలు కాలేదు. రైతుల పాలిట అభయ హస్తం భస్మాసుర హస్తంగా మారింది. రైతు రుణమాఫీ కోసం అన్నదాతలు ఎదురుచూస్తున్నారు. ఏ నియోజక వర్గంలో చూసినా ఇదే పరిస్థితి నెలకొంది. రుణమాఫీ అమలు పూర్తయిపోయిందని ప్రభుత్వం చెబుతోంది. ఏ గ్రామం వెళ్లినా తమకు రుణమాఫీ కాలేదని రైతులు చెబుతున్నారు. ఆత్మహత్యలు ఆగాలని కేసీఆర్ రైతు బంధును ప్రవేశపెట్టారు. ఎన్ని విపత్తులు వచ్చినా రైతు బంధును కేసీఆర్ ఆపలేదు. మేము ఒక్క సీజన్ కూడా రైతు బంధును ఎగ్గొట్టలేదు. నాట్లు వేసే సమయంలో ఇవ్వాల్సిన రైతు భరోసాను కోతల సమయంలో ఇస్తున్నారు. మీరు ఎగ్గొట్టిన రైతు భరోసాను ఎప్పుడు ఇస్తారు? బడ్జెట్ ప్రతులను కాపీ పేస్ట్ చేస్తున్నారు. రాజీవ్ యువ వికాసం అంటూ గత బడ్జెట్ లో రూ.6వేల కోట్లు పెట్టారు.. ఒక్కరికీ ఇవ్వలేదు. గతసారి యువ వికాసం నిధులు ఎవరి జేబుల్లోకి వెళ్లాయి?' అని హరీష్ రావు అన్నారు.

## మండిపోతున్న మెట్రో ఛార్జీలు!

-మొదటిపేజీ తరువాయి



తగ్గిన ప్రయాణికుల సంఖ్య : ఛార్జీలు పెంచడంతో హైదరాబాద్ మెట్రోలో ప్రయాణికులు తగ్గారని అధికారుల కమిటీ ఇటీవలే ప్రకటించింది. గత సంవత్సరం ఛార్జీలను 20 నుంచి 30 శాతం వరకు పెంచిన విషయం తెలిసిందే. క్రితం ఆర్థిక సంవత్సరంలో రోజువారీ సగటు ప్రయాణికుల సంఖ్య 4.44 లక్షలు ఉన్నారు. హైదరాబాద్ మెట్రో ఛార్జీలు పెంచిన అనంతరం 4.28 లక్షలకు తగ్గినట్లు నివేదికలో వెల్లడించారు. 9 కి.మీ. దాటితే రూ.47 : హైదరాబాద్ నగరంలో ఆర్డినరీ బస్సులు, ఆటో కనిష్ఠ ఛార్జీ రూ.15తో పోలిస్తే మెట్రోనే చౌక అని అధికారులు అంటున్నారు. కనీస ఛార్జీ తక్కువే ఉన్నా కూడా 9 కి.మీ. దాటితే రూ.47 అవుతోందని, ఇది ఒకింత ప్రయాణికులకు భారమేనని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడు ప్రైవేట్? నిర్వహణలో ఉన్న హైదరాబాద్ మెట్రో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ అధీనంలోకి వచ్చాక ఛార్జీల పరంగా ఊరట కల్పించేలా నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉందని పలువురు అంటున్నారు.

### దేశంలోని వివిధ నగరాల్లో ఛార్జీల సవరణ ఇలా : -

దేశంలో మెట్రో స్టేషన్ల నిర్వహణ, మౌలిక సదుపాయాల అభివృద్ధికి టికెట్ ధరలను సవరిస్తున్నాయి.

దిల్లీ మెట్రో గత సంవత్సరం కనీస ఛార్జీని రూ.10 నుంచి రూ.11కి, గరిష్ఠ ఛార్జీని రూ.60 నుంచి రూ.64కి పెంచారు. చాలా మెట్రోలతో పోలిస్తే ఇవి చాలా తక్కువ. ఛార్జీలు అందుబాటులో ఉండటంతో ప్రయాణికుల ఆదరణ పొందింది దిల్లీ మెట్రో.

హైదరాబాద్ మెట్రోలో గత సంవత్సరం కనీస ఛార్జీని రూ.10 నుంచి రూ.12కి, గరిష్ఠంగా రూ.60 నుంచి రూ.75కు పెంచింది. ప్రయాణికుల నుంచి వ్యతిరేకత వచ్చింది. దీంతో హైదరాబాద్ మెట్రో 10 శాతం రాయితీ అమలు చేస్తున్నారు. ఇప్పుడు కనిష్ఠ ఛార్జీ రూ.11 ఉండగా గరిష్ఠంగా రూ.69 వసూలు చేస్తున్నారు.

కర్ణాటక రాష్ట్ర రాజధాని బెంగళూరు మెట్రో ఈ సంవత్సరం గత నెలలో కనిష్ఠ ఛార్జీలు రూ.10 నుంచి రూ.11కు, గరిష్ఠంగా రూ.90 నుంచి రూ.95కి పెంచారు. పలు రాజకీయ కారణాలతో అమలు నిలిపివేసింది. ఇప్పుడు బెంగళూరు మెట్రో రూ.10 నుంచి రూ.90 మధ్య ఛార్జీలు ఉన్నాయి.

తమిళనాడు రాష్ట్ర రాజధాని చెన్నైలో రూ.10 నుంచి రూ.50 మధ్యలో ఉన్నాయి.

అత్యంత చౌకగా కోల్‌కతాలో రూ.5 నుంచి రూ.30 ఛార్జ్ చేస్తున్నారు.

# కాంగ్రెస్‌తోనే బోథ్ సమగ్రాభివృద్ధి

**అగ్నిమాపక కేంద్రం మంజూరు ప్రజాపాలనకు నిదర్శనం**
**గత పాలకులది నిర్లక్ష్య వైఖరి, అణచివేత ధోరణి**
**కాంగ్రెస్ నాయకులు, బోథ్ వార్డు సభ్యులు షేక్ షాకీర్**



**వాస్తవ నేస్తం,ఆదిలాబాద్(బోథ్) :** బోథ్ నియోజకవర్గ అభివృద్ధి కేవలం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ఆ పార్టీ నాయకులు, స్థానిక వార్డు సభ్యులు షేక్ షాకీర్ స్పష్టం చేశారు. మండల ప్రజల దీర్ఘకాలిక కల అయిన అగ్నిమాపక కేంద్రాన్ని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేయడం పారదర్శక, ప్రజాపాలనకు నిలువుటద్దమని ఆయన కొనియాడారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజల ప్రాణాలు, ఆస్తులను రక్షించేందుకు అత్యవసరమైన ఈ సదుపాయం ఎట్టకేలకు అందుబాటులోకి రావడం పట్ల బోథ్ మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని ఆయన తెలిపారు. గతంలో అధికారంలో ఉన్న భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) ప్రభుత్వం ఈ కీలక అంశాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని షేక్ షాకీర్ తీవ్రంగా ఖండించారు. అగ్నిమాపక కేంద్రం కోసం ప్రజలు, ప్రజా ప్రతినిధులు న్యాయబద్ధంగా డిమాండ్ చేస్తే స్పందించకపోగా, ఉద్యమాలు చేసిన వారిపై కేసులు నమోదు చేయడం ప్రజాస్వామ్యానికే విరుద్ధమన్నారు. అధికార మదంతో ప్రజల స్వరాన్ని అణగదొక్కే ప్రయత్నం చేయడం అప్పటి ప్రభుత్వ అసమర్థతకు, బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని విమర్శించారు.

సమస్యలను పరిష్కరించాల్సిన గత ప్రభుత్వం, వాటిని పట్టించుకోకుండా నిరసనలను అణచివేయడం ద్వారా ప్రజల నమ్మకాన్ని పూర్తిగా కోల్పోయిందని ఆయన అన్నారు. బోథ్ మండల ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులు, అగ్నిప్రమాదాల సమయంలో జరిగిన నష్టాలు ఇవన్నీ గత ప్రభుత్వ వైఫల్యాన్ని స్పష్టంగా ప్రతిబింబిస్తున్నాయని పేర్కొన్నారు.

ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల అవసరాలను గుర్తించి, సమస్యల పరిష్కార దిశగా అడుగులు వేయడం అభినందనీయమన్నారు. ఇది కేవలం ఒక అగ్నిమాపక కేంద్రం మంజూరు మాత్రమే కాదని, ప్రజాస్వామ్య విలువలకు దక్కిన గౌరవమని ఆయన ఉద్ఘాటించారు. ఇకపై కూడా బోథ్ నియోజకవర్గ అభివృద్ధి కేవలం ప్రస్తుత ప్రజాపాలనలోనే సాధ్యమవుతుందని షేక్ షాకీర్ ధీమా వ్యక్తం చేశారు.

# ఎత్తు పెరిగింది.. గింజల్లేవ్!

**నాసిరకం మొక్కజొన్న విత్తనాలతో నిండా మునిగిన రైతులు**
**వల్లాపురంలో సుమారు వంద ఎకరాల్లో పంట నష్టం**
**ఎకరాకు 40 క్వింటాళ్లకు బదులు 10 క్వింటాళ్ల దిగుబడే..**



**ముదిగొండ :** నాసిరకం మొక్కజొన్న విత్తనాలతో వల్లాపురం గ్రామంలో సుమారు సుమారు 20 మంది రైతులు వంద ఎకరాల్లో పంట నష్టపోయారు. పంట ఎత్తుగా పెరిగింది.. కానీ కంకులు చిన్న సైజ్‌లోనే ఉన్నాయి. కొన్ని కంకులైతే సరిగా గింజలు కూడా రాలేదు. ఎకరాకు 40 క్వింటాళ్ల దిగుబడి రావాల్సిన పంట 10 క్వింటాళ్లు కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. దీంతో బాధిత రైతులు చేతికొచ్చిన పంటను చూసి లబోదిబోమంటున్నారు. గ్రామానికి చెందిన గడ్డం అప్పిరెడ్డి అనే రైతు 10 ఎకరాలు కౌలుకు తీసుకుని యాసంగి మొక్కజొన్న సాగు చేశాడు. పది ఎకరాల్లో కలిపి నాలుగు రకాల కంపెనీల విత్తనాలను నాటాడు. మూడు ఎకరాల్లో 'మైకో 4060' రకానికి చెందిన విత్తనాలు నాటాడు. పది ఎకరాల్లో పంట చూడటానికి మంచిగానే ఎదిగినా కాతకు వచ్చేసరికే ఈ మూడెకరాల్లో కంకి సైజ్ పెరగలేదు. క్రమంగా పెరుగుతుందని భావించగా పంట కోతకు వచ్చినా సాధారణ కంకితో పోలిస్తే ఈ మొక్కజొన్న కంకి సగం సైజు కూడా పెరగలేదు. వీటిలో కూడా అక్కడక్కడ సరిగా విత్తనాలు రాలేదు. పంట నష్టపోయానని భావించిన రైతు విత్తనాలు కొనుగోలు చేసిన డీలరుకు విషయం చెప్పగా సదరు కంపెనీకి తెలియజేయగా వారి ప్రతినిధులు వచ్చి పంటను పరిశీలించారు. వాతావరణంలో మార్పుల వల్ల దిగుబడి సరిగా రాలేదు.. తమ సంస్థ పెద్దలకు తెలియజేస్తామని చెప్పారు. ఇప్పటికి నెలరోజులు దాటినా ఎలాంటి స్పందన లేదు. ఫోన్ చేస్తే మేము ఏమీ చేయలేం.. మీరు ఏం చేసుకుంటారో చేసుకోండని బెదిరింపు ధోరణితో మాట్లాడుతున్నారని రైతు అప్పిరెడ్డి వాపోయాడు. వ్యవసాయ అధికారులకు విషయం తెలుపగా చర్యలు తీసుకుంటామని చెప్పినా ఇప్పటివరకూ స్పందన లేదు. పది ఎకరాల్లో ఒకేసారి విత్తనాలు నాటగా ఈ రకం మాత్రమే సరిగా పండలేదని, మిగిలిన పంట మంచిగా ఉన్నదని, భూమి, సాగువిధానంలో తేడా ఉంటే మొత్తం పంటపోతుంది కానీ కేవలం ఈ రకం మాత్రమే ఎందుకు పండదని రైతు ప్రశ్నిస్తున్నాడు. ఎకరాకు 40 క్వింటాళ్ల వరకూ వచ్చే దిగుబడి ఈ మూడు ఎకరాల్లో 10 నుంచి 15 క్వింటాళ్లు రావటం కూడా కష్టమేనని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. గ్రామంలో ఈ రకం విత్తనాలతో సాగుచేసిన సుమారు 20మంది రైతుల మొక్కజొన్న పరిస్థితి కూడా ఇదేవిధంగా ఉండగా సుమారు 100 ఎకరాల్లో పంట నష్టపోతున్నారు. ఎంత తిరిగినా పరిహారంరాదని, తిరగటానికి అదనపు ఖర్చులు తప్ప ఉపయోగంలేదని మానుకున్నామని రైతులు చెబుతున్నారు. దిగుబడి సరిగా వస్తేనే పెట్టుబడులు రావటం కష్టంగా ఉందని, ఈ అరకొర దిగుబడి వల్ల తీవ్రంగా నష్టపోతామని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు. ఈ విషయంపై మండల వ్యవసాయ అధికారి సరితను వివరణ కోరగా గడ్డం అప్పిరెడ్డి అనే రైతు తమకు ఫిర్యాదు చేయగా పై అధికారులకు తెలియజేశామని, వారు రెండు మూడురోజుల్లో శాస్త్రవేత్తలను పంపిస్తామని చెప్పారన్నారు. పూర్తి పరీక్షలు చేసిన తరువాత విత్తనాల్లో సమస్య ఉన్నట్లు తేలితే చర్యలు తీసుకుంటామన్నారు.

**నాసిరకం విత్తనాలతో మోసపోయా..**

పదెకరాలు కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నాను. మూడెకరాల్లో వేసిన పంట మాత్రమే సరిగా దిగుబడి రాలేదు.. మిగిలిన పంట బాగానే ఉంది. ఎకరాకు 40 క్వింటాళ్ల దిగుబడి రావాల్సింది ఈ మూడెకరాల్లో 10 క్వింటాళ్లు వచ్చే పరిస్థితి లేదు. విత్తనాలు అమ్మిన డీలర్‌కు తెలుపగా కంపెనీవారు వచ్చి పంట చూసి తమ సంస్థ పెద్దలకు చెబుతామని వెళ్లారు.. ఫోన్ చేస్తే బెదిరింపు ధోరణితో మాట్లాడుతున్నారు. అధికారులు సదరు విత్తనాల కంపెనీపై చర్యలు తీసుకొని నాకు న్యాయం చేయాలి.

# ఓవర్‌లోడ్‌తో మోటార్లు పనిచేయక పంటలు ఎండిపోతున్నయ్..

## అదనపు ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేయాలని ఆదివారంపేట రైతుల వినతి



**రామగిరి :** కరెంట్ ఓవర్‌లోడ్ సమస్యతో వ్యవసాయ మోటార్లు సరిగా పనిచేయక పంటలు ఎండిపోతున్నాయని ఆదివారంపేట గ్రామ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై అధికారులు స్పందించి వెంటనే అదనపు ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేయాలని రైతులు పెద్దపల్లి కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఆదివారంపేట గ్రామంలో విద్యుత్ ఓవర్‌లోడ్ కారణంగా రైతులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. వ్యవసాయ మోటార్లు సరిగా నడవకపోవడంతో పొలాలకు తగినంత నీరు అందడం లేదని రైతులు తెలిపారు. దీంతో సాగు చేసిన పంటలు ఎండిపోతున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై గతంలో ఒకసారి మళ్లీ సోమవారం కూడా కలెక్టర్‌ను కలిసి తమ సమస్యను వివరించినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి పరిష్కారం లభించలేదని రైతులు తెలిపారు. ఇదే సమస్యపై రామగిరి తహసీల్దార్‌కు కూడా వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. విద్యుత్ శాఖ అధికారులు, రెవెన్యూ అధికారులు తమ సమస్యను పట్టించుకోవడం లేదని వారు ఆరోపించారు. అధికారులు తమ గ్రామాన్ని సింగరేణి విస్తరణ, ప్రభావిత ప్రాంతంగా చూపిస్తూ సమస్యను పరిష్కరించడంలో ఆలస్యం చేస్తున్నారని రైతులు విమర్శించారు. అయితే ఆదివారంపేట గ్రామ శివారులో సింగరేణి సంస్థకు సంబంధించిన భూమి ఒక్క గుంట కూడా లేదని రైతులు స్పష్టం చేశారు. ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకొని అధికారులు తమ సమస్యను వెంటనే పరిష్కరించాలని వారు కోరారు. కరెంట్ ఓవర్‌లోడ్ కారణంగా దిగువ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా తక్కువగా వస్తోందని, దీనివల్ల వ్యవసాయ మోటార్లు పనిచేయక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని రైతులు తెలిపారు. కాబట్టి అధికారులు తక్షణమే స్పందించి అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి రైతులకు ఉపశమనం కల్పించాలని వారు విజ్ఞప్తి చేశారు.

## శనగ, పొద్దుతిరుగుడు కొనుగోలు కేంద్రాల ప్రారంభం



**వాస్తావ నేస్తం కోటగిరి(పోతంగల్) :** పోతంగల్ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శనగ మరియు పొద్దుతిరుగుడు పంటల కొనుగోలు కేంద్రాలను సోమవారం కోటగిరి మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతు మరియు స్థానిక సర్పంచ్ కల్లూరు సంధ్య భజరంగ్ ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రైతులు తాము పండించిన పంటను దళారులకు అమ్మి మోసపోకుండా, ప్రభుత్వం కల్పించిన ఈ కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని కోరారు. అనంతరం సహకార సంఘం పి.ఐ.సి అధికారి ఎండీ. రియాజుద్దీన్ మాట్లాడుతూ రైతులు నాణ్యమైన పంటను కేంద్రాలకు తీసుకువచ్చి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలను పొందాలని సూచించారు. శనగ క్వింటాల్‌కు రూ. 5,875/- మరియు పొద్దుతిరుగుడు క్వింటాల్‌కు రూ. 7,721/- మద్దతు ధర నిర్ణయించినట్లు ఆయన వెల్లడించారు ఈ కార్యక్రమంలో పోతంగల్ మండల అధికారి, ఏఈఓ శంకర్, సహకార సంఘం సిబ్బంది మరియు పరిధిలోని రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గీత కార్మికుల పొట్ట కొడుతున్న 'విషనాగులు'

**కోటగిరి సొసైటీలో అక్రమాలపై ఎక్సైజ్ ఎస్పీకి ఫిర్యాదు.**



**వాస్తవ నేస్తం,కోటగిరి:** గీత పారిశ్రామిక సహకార సంఘంలో గత కొంతకాలంగా సాగుతున్న అక్రమాలకు చరమగీతం పాడాలని, అవినీతికి పాల్పడుతున్న డి. సాయ గౌడ్, డి. శ్రీధర్ గౌడ్ లపై అధికారులు కఠినమైన చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని టిసిఎస్ అధ్యక్షులు డి. శంకర్ గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం కోటగిరి మండల కేంద్రంలోని ఎస్. ఫంక్షన్ హాల్‌లో గీత పారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రిజిస్ట్రేషన్ నెంబర్ 242 గల ఈ సొసైటీపై సుమారు 60 గీత కార్మికుల కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నాయని, అయితే గత రెండేళ్లుగా డిపో మేనేజ్‌మెంట్‌గా సాయ గౌడ్, క్యాషియర్‌గా శ్రీధర్ గౌడ్ వ్యవహరిస్తూ సంఘం నిధులను పక్కదారి పట్టిస్తున్నారని ఆరోపించారు. సొసైటీకి సంబంధించిన జమ ఖర్చులు, లాభనష్టాల వివరాలను సభ్యులకు తెలియనివ్వకుండా గోప్యంగా ఉంచుతున్నారని, నిలదీసిన వారిపై దౌర్జన్యానికి దిగుతున్నారని మండిపడ్డారు. చీమలు పెట్టిన పుట్టలో విషనాగులు చేరినట్లుగా, తండ్రీకొడుకులు ఇద్దరూ కలిసి సంఘం నిధులతో విలాసవంతమైన జీవితాలు గడుపుతున్నారని, అటు కార్మికులను, ఇటు సభ్యులను విభజించి పాలిస్తూ లక్షలాది రూపాయలు దోచుకుంటున్నారని ధ్వజమెత్తారు. ఈ అవినీతి వ్యవహారంపై నిజాంబాద్ జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తామని శంకర్ గౌడ్ స్పష్టం చేశారు. ఇకపై కోటగిరి గీత పారిశ్రామిక సహకార సంఘం గ్రూపు సొసైటీ కార్యకలాపాలు పాలకవర్గం ద్వారానే కొనసాగుతాయని ఆయన ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సంఘం మాజీ అధ్యక్షులు విఠల్ గౌడ్, ఉపాధ్యక్షులు అరుణ్ కుమార్ గౌడ్, కార్యదర్శి సాయి బాబా గౌడ్ తో పాటు గౌడ సంఘం నాయకులు శ్యామ్ సుందర్ గౌడ్, రమేష్ గౌడ్, నాగ గౌడ్, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన లింగాపూర్ సర్పంచ్



**వాస్తవ నేస్తం,కోటగిరి :** మండల కేంద్రంలోని లింగాపూర్ గ్రామ ప్రభుత్వ పాఠశాలలో సోమవారం మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును గ్రామ సర్పంచ్ దొడ్డిమిడి శారదా రాచప్ప పటేల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహార నాణ్యతను, వంట గది పరిశుభ్రతను స్వయంగా పరిశీలించారు. అనంతరం, విద్యార్థులతో కలిసి సర్పంచ్ మధ్యాహ్న భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సెక్రటరీ రాజు, పాఠశాల ఉపాధ్యాయులు సంతోష్ పాల్గొని విద్యార్థులతో కలిసి పంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ శరద రాచప్ప మాట్లాడుతూ.. విద్యార్థులకు పౌష్టికాహారం అందించడంలో ఎటువంటి అలసత్వం వహించరాదని అధికారులకు, వంట సిబ్బందికి సూచించారు. మెనూ ప్రకారం ప్రతిరోజూ నాణ్యమైన భోజనం అందించాలని, పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. సర్పంచ్ మరియు సెక్రటరీ తమతో కలిసి భోజనం చేయడంతో విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

## చికిత్స పొందుతూ కొత్తపల్లికి చెందిన రేణి మొగులవ్వ మృతి



**వాస్తవ నేస్తాం కోటగిరి :** మండల కేంద్రంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన రేణి మొగులవ్వ చికిత్స పొందుతూ మరణించింది. గత నెల ఫిబ్రవరి 15వ తేదీన జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆమెను తొలుత నిజామాబాద్ ఆసుపత్రికి, అనంతరం మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మార్చి 21వ తేదీ శనివారం రాత్రి ఆమె తుదిశ్వాస విడిచారు. భర్త రెని సాయిలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ విషాద ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

Vaasthava Nestham Telugu daily: Printed, Published Edited and Owned by: SYED QAMAR, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin Code: 504307, Printed at AR printers, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin code: 504307, TITLE CODE: TELMUL/2023/85744, EDITOR: SYED QAMAR Contact Number: 8099779988, Email: vntelugudaily@gmail.com, vaasthavanestham.com